క్లుప్తంగా

సీఐ బాధ్యతల స్వీకరణ


బాధ్యతలు చేపడుతున్న సీఐ రాజగోపాల్

పర్వతగిరి: పర్వతగిరి సర్కిల్ ఇన్‌స్పెక్టర్‌గా బి.రాజ గోపాల్ బుధవారం బాధ్యతలు స్వీకరించారు. గతంలో ఇక్కడ పని చేసిన సీఐ శ్రీనివాస్ సస్పెండ్ కావడంతో అతని స్థానంలో దుగ్గొండి మండలం నుంచి రాజగోపాల్ బదిలీపై పర్వతగిరికి వచ్చారు.

మార్కెట్ చైర్మన్‌కు సన్మానం



నర్సంపేట: నర్సంపేట వ్యవసాయ మార్కెట్ కమిటీ నూతన చైర్మన్‌గా బాధ్యతలు చేపట్టిన పాలాయి శ్రీనివాస్‌ను పలు స్వచ్ఛంద సంస్థల ప్రతినిధులు బుధవారం అభినందించారు. ఈ సందర్భంగా శ్రీనివాస్ మాట్లాడుతూ స్వచ్ఛంద సంస్థలు నిర్వహించే సేవా కార్యక్రమాలకు తనవంతు సహకారం అందిస్తానన్నారు. కార్యక్రమంలో జిల్లా వినియోగదారుల మండల అధ్యక్షుడు గిరగాని సుదర్శన్‌గౌడ్, ఏఎస్‌ఆర్ సేవా స్వచ్ఛంద సంస్థ నిర్వాహకుడు ఎర్రబోయిన రాజశేఖర్, స్వయంకృషి స్వచ్ఛంద సంస్థ బాధ్యుడు బెజ్జంకి ప్రభాకర్, ఛాయా స్వచ్ఛంద సంస్థ నిర్వాహకుడు కోట డేవిడ్, జిల్లా వినియోగదారుల మండలి సభ్యుడు నాగెల్లి సారంగం, నర్సంపేట మెడికల్ షాప్ అసోసియేషన్ జాయింట్ సెక్రటరీ తంగెళ్ల రవికాంత్, చారి, వెంకన్న పాల్గొన్నారు.

విద్యుత్ స్తంభాల ఏర్పాటు



సాక్షి ఎఫెక్ట్..

రాయపర్తి: మండలంలోని బురహాన్‌పల్లి శివారు జానకమ్మబండతండాకు వెళ్లే రహదారిలో వేలాడుతున్న విద్యుత్‌తీగలపై 'బురహాన్‌పల్లిలో వేలాడుతున్న విద్యుత్‌తీగలు' అనే శీర్షికన సాక్షిలో ఈనెల 12న ప్రచురితమైంది. విద్యుత్ అధికారులు స్పందించి స్తంభాలను ఏర్పాటు చేశారు.

వ్యక్తి ఆత్మహత్య

ఖిలా వరంగల్: ఆర్థిక ఇబ్బందులు తాళలేక ఓ వ్యక్తి ఇంట్లో ఫ్యాన్‌కు ఉరేసుకుని ఆత్మహత్యకు పాల్పడిన ఘటన వరంగల్ 39వ డివిజన్ ఏకశిలనగర్‌లో బుధవారం జరిగింది. స్థానికుల కథనం ప్రకారం వర్ధన్నపేట మండలం జమిల్‌పురం గ్రామానికి చెందిన దుబ్బు మాధవ్ (36), రాధిక దంపతులిద్దరు కౌలుకు భూమి తీసుకుని వ్యవసాయం చేసి అప్పులయ్యాయి. అప్పులు తీర్చే పరిస్థితి లేక రెండేళ్ల క్రితం వరంగల్ 39వ డివిజన్ జన్మభూమి జంక్షన్ సమీపంలోని ఏకశిలనగర్‌కు వలస వచ్చారు. ఆర్థిక ఇబ్బందులతో మాధవ్ ఆత్మహత్యకు పాల్పడ్డాడు. దుబ్బు యాకమ్మ ఫిర్యాదు మేరకు కేసు నమోదు చేసి దర్యాప్తు చేస్తున్నట్లు పోలీసులు తెలిపారు.

జాతీయ జెండాల పంపిణీ

గీసుకొండ: గ్రేటర్ వరంగల్ నగరం 15వ డివిజన్ మొగిలిచర్ల, పోతరాజుపల్లి, గొర్రెకుంట, రెడ్డిపాలెంలో బుధవారం బీజేపీ నాయకులు స్వాతంత్య్ర దినోత్సవం హర్‌ఘర్ తిరంగా కార్యక్రమంలో భాగంగా జాతీయ జెండాలను పంపిణీ చేశారు. బీజేపీ జిల్లా ఉపాధ్యక్షుడు రాదారపు శివకుమార్, డివిజన్ అధ్యక్షుడు బిల్లా రమేష్, బీసీ మోర్చా జిల్లా కార్యదర్శి ఆడెపు రమేష్, డివిజన్ ప్రధాన కార్యదర్శి ల్యాదల్ల ప్రభాకర్, నాయకులు నరిశెట్టి చంద్రమౌళి, లెంకలపెల్లి స్వామి తదితరులు పాల్గొన్నారు.

ఎస్సైని కలిసిన నాయకులు

పర్వతగిరి: పర్వతగిరి ఎస్సై బోగం ప్రవీణ్‌ను నేషనల్ హ్యూమన్ రైట్స్ కమిటీ, స్వేరోస్ నాయకులు బుధవారం మర్యాదపూర్వకంగా కలిశారు. ఈ సందర్భంగా ఎస్సై ప్రవీణ్‌ను శాలువాతో సత్కరించారు. ఈ కార్యక్రమంలో ఎన్‌హెచ్‌ఆర్‌సీ పర్వతగిరి ఇన్‌చార్జి గారె జయరాజ్, స్వేరోస్ నాయకులు భూక్య ప్రవీణ్, భానోత్ రమేష్, ఎద్దు రాహుల్, మాజీ ఎంపీటీసీల ఫోరం మండల అధ్యక్షుడు యాలాద్రి, ముంజాలకుంటతండా మాజీ ఉపసర్పంచ్ మోహన్ పాల్గొన్నారు.

పోస్టర్ల ఆవిష్కరణ

నర్సంపేట: ప్రభుత్వం ప్రజలకు ఇచ్చిన హామీలను అమలు చేయాలని కోరుతూ ఈనెల 22వ తేదీన సీపీఐ(ఎంఎల్) మాస్ లైన్ ఆధ్వర్యంలో హైదరాబాద్ ఇందిరా పార్క్ వద్ద నిర్వహించనున్న ర్యాలీ, ధర్నాను జయప్రదం చేయాలని సీపీఐ(ఎంఎల్) మాస్ లైన్ నర్సంపేట డివిజన్ కార్యదర్శి అడ్డూరి రాజు పిలుపునిచ్చారు. ఈ మేరకు పట్టణంలో బుధవారం ఛలో హైదరాబాద్ వాల్ పోస్టర్లను ఆవిష్కరించారు. కార్యక్రమంలో శిరిమోజు భద్రాచారి, రాజేందర్, అడ్డూరి మనోహరచారి, రవి, కుమార్, జవహర్‌లాల్, గాదె రాజు, పుట్ట రాజేందర్, తదితరులు పాల్గొన్నారు.

పోచమ్మతల్లి.. సల్లంగచూడు


దుగ్గొండి: గిర్నిబావిలో బోనాలతో తరలివెళ్తున్న మహిళలు


వర్ధన్నపేట: పోచమ్మ తల్లికి మొక్కులు చెల్లిస్తున్న భక్తులు

- గ్రామదేవతకు బోనాల చెల్లింపు
- కోడిపిల్ల, మేకపోతుల బలి
- కల్లుశాక ఆరగింపు

వర్ధన్నపేట: వర్ధన్నపేట పట్టణంలో అన్ని సామాజిక వర్గాల ప్రజలు బుధవారం పోచమ్మ తల్లికి బోనాలు సమర్పించి మొక్కులు చెల్లించుకున్నారు. ఇదిలా ఉండగా.. ఆలయం వద్ద భక్తులు కానుకలను ఫోన్‌పే, గూగుల్ పే ద్వారా స్కాన్ చేసి చెల్లించారు.

నల్లబెల్లి మండలంలో..

నల్లబెల్లి: మండలంలోని నల్లబెల్లి, రుద్రగూడెం, నందిగామ, రేలకుంట తదితర గ్రామాల్లో బుధవారం పోచమ్మ బోనాలు వైభవంగా నిర్వహించారు. ఈ సంర్భంగా ఆయా గ్రామాల్లో మహిళలు డీజే సౌండ్స్ మధ్య ఊరేగింపుగా పోచమ్మ ఆలయం వద్దకు చేరుకున్నారు. అనంతరం అమ్మవారికి ప్రత్యేక పూజలు చేసి, బోనాన్ని సమర్పించారు.

నర్సంపేట రూరల్ : నర్సంపేట మండలంలోని అన్ని గ్రామాల్లో పోచమ్మ బోనాలు ఘనంగా నిర్వహించారు. హైదరాబాద్‌లో సాఫ్ట్‌వేర్ డెవలపర్‌గా విధులు నిర్వహిస్తున్న పడిదల నవీన్ కుమార్ ముత్తోజిపేటలో సొంత నిధులతో గ్రామ శివారులో పోచమ్మదేవాలయాన్ని నిర్మించారు. ముత్తోజిపేటలో డప్పు వాయిద్యాలు, కోలాటాల నడుమ బోనాలతో పోచమ్మ దేవాలయానికి చేరుకొని పూజలు నిర్వహించారు. నర్సంపేట మార్కెట్ కమిటీ చైర్మన్ పాలాయి శ్రీనివాస్, కాంగ్రెస్ పార్టీ జిల్లా మహిళా అధ్యక్షురాలు కర్నాటి పార్వతమ్మతోపాటు నాయకులు ప్రత్యేక పూజలు చేశారు.

చెన్నారావుపేట: మండలంలోని పలు గ్రామాల్లో బుధవారం పోచమ్మ పండుగ వేడుకలను ఘనంగా జరుపుకున్నారు. మహిళలు డప్పు చప్పుళ్లతో ఆలయానికి వెళ్లి మొక్కులు చెల్లించుకున్నారు.

గిర్నిబావిలో..

దుగ్గొండి: మండలంలోని పలు గ్రామాల్లో బుధవారం బోనాల పండుగ ఘనంగా జరుపుకున్నారు. ర్యాలీగా పోచమ్మ దేవాలయాలకు వెళ్లి బోనం సమర్పించారు.

రాయపర్తి: మండలంలోని కొండూరు, గట్టికల్, కేశవాపురం, గన్నారం గ్రామాల్లో బుధవారం ముత్యాలమ్మ, మారమ్మ తల్లులకు మొక్కులు చెల్లించుకున్నారు.


నర్సంపేట రూరల్: పూజలు చేస్తున్న భక్తులు


చెన్నారావుపేట: లింగాపురంలో..


నల్లబెల్లి ఊరేగింపులో పాల్గొన్న భక్తులు

గ్రీన్ క్యాంపస్ ఏర్పాటుకు తోడ్పడాలి


గ్రీన్ క్యాంపస్ ప్రారంభిస్తున్న ప్రిన్సిపాల్ నవీన్

నర్సంపేట: విద్యార్థులు పచ్చదనం–పరిశుభ్రతను పాటించి గ్రీన్ క్యాంపస్ ఏర్పాటుకు తోడ్పడాలని ప్రభుత్వ డిగ్రీ కళాశాల ప్రిన్సిపాల్ ప్రొఫెసర్ మల్లం నవీన్ అన్నారు. ఈ మేరకు కళాశాలలో బుధవారం క్లైమేట్ స్మార్ట్ గ్రీన్ క్యాంపస్ క్లబ్‌ను ప్రారంభించారు. ఈ సందర్భంగా ప్రిన్సిపాల్ నవీన్ మాట్లాడుతూ తెలంగాణ రాష్ట్ర కళాశాల విద్యాశాఖ ఆదేశానుసారం ప్రతి ప్రభుత్వ డిగ్రీ కళాశాలలో పచ్చదనం–పరిశుభ్రత అనే కార్యక్రమంలో భాగంగా కళాశాలలో విద్యార్థులు సభ్యులుగా గ్రీన్ క్యాంపస్ క్లబ్‌లను ఏర్పాటు చేసినట్లు తెలిపారు. కార్యక్రమ నిర్వాహకుడు, కళాశాల వృక్షశాస్త్ర అధ్యాపకుడు డాక్టర్ ఎం.రాంబాబు మాట్లాడుతూ.. మొక్కల పెంపకం ద్వారా పర్యావరణ పరిరక్షణ సాధ్యమన్నారు. కార్యక్రమంలో కళాశాల అధ్యాపకులు బైరి సత్యనారాయణ, కందాల సత్యనారాయణ, ఎంఎంకె. రహీముద్దీన్, ఎస్.కమలాకర్, సోమయ్య, రాజీరు, భద్రు భూక్య, ఆర్.రుద్రాణి, డి.సంధ్య, రజిత, బి.వీరన్న, నిజాము, బి.రమేష్, అడ్మినిస్ట్రేటివ్ ఆఫీసర్ అనిత తదితరులు పాల్గొన్నారు.

మొక్కలను సంరక్షించాలి

గీసుకొండ: స్వచ్ఛదనం–పచ్చదనం కార్యక్రమంతోపాటు వనమహోత్సవంలో నాటిన మొక్కలను సంరక్షించాలని ఇన్‌చార్జ్ ఎంపీడీఓ కమలాకర్ అన్నారు. బుధవారం మండల పరిషత్ కార్యాలయంలో పంచాయతీ కార్యదర్శులు, ఉపాధి సిబ్బందితో ఆయన సమీక్షా సమావేశం నిర్వహించారు. చనిపోయిన మొక్కల స్థానంలో మళ్లీ నాటాలని, ప్రభుత్వ కార్యాలయాలతోపాటు ఎవెన్యూ, బండ్ ప్లాంటేషన్, కిచెన్ గార్డెన్ మొక్కలను పరిరక్షించాలన్నారు. ఇప్పటికే మండలంలో 33వేల మొక్కలను నాటామని, మరో 7వేల మొక్కలను నాటాలని పంచాయతీ కార్యదర్శులకు సూచించారు. ఏపీఓ చంద్రకాంత్, ఈసీ శ్రీలత, టీఏలు, ఫీల్డ్ అసిస్టెంట్లు తదితరులు పాల్గొన్నారు.

గ్రామాల అభివృద్ధి పనులకు తొలిప్రాధాన్యం


సీసీ రోడ్డు పనులను ప్రారంభిస్తున్న రంజిత్‌రెడ్డి

నెక్కొండ: గ్రామాల్లో అభివృద్ధి పనులకు ప్రభుత్వం తొలిప్రాధాన్యతనిస్తుందని టీపీసీసీ సభ్యుడు సొంటి రెడ్డి రంజిత్‌రెడ్డి అన్నారు. మండలంలోని పెద్ద కొర్పోలులో పలు అభివృద్ధి పనులను ఆయన ప్రారంభించారు. ఎస్‌డీఎఫ్ నిధులు రూ.4లక్షలతో చేపట్టనున్న సీసీ రోడ్డు పనులతోపాటు పంపు సెట్లను ఆయన ప్రారంభించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ.. గత కొంత కాలంగా పంపు సెట్ పని చేయక పోవడంతో గురుకుల విద్యార్థులు అవస్థలు పడ్డారని అన్నారు. విద్యార్థుల ఇబ్బందులకు గుర్తించి గ్రామ మాజీ ఎంపీటీసీ కర్ర సుకన్య చిన్నారెడ్డి రెండు పంపు సెట్లను అందించారని పేర్కొన్నారు. విద్యార్థులతో మాట్లాడి సమస్యలను తెలుసుకున్నారు. కార్యక్రమంలో కాంగ్రెస్ పార్టీ మండల అధ్యక్షుడు బక్కి అశోక్, నెక్కొండ ఏఎంసీ చైర్మన్ రావుల హరీశ్‌రెడ్డి, పట్టణ అధ్యక్షుడు పండ్యాల హరిప్రసాద్, ఓబీసీ జిల్లా సెల్ జిల్లా ప్రధాన కార్యదర్శి రాచకొండ రఘు, గురుకుల ఎస్‌ఓ రజిత, నాయకులు పడాల రవి, బొడ్డుపల్లి యాదగిరి, రాజేందర్, ఉపాధ్యాయులు పాల్గొన్నారు.

గ్రామాల అభివృద్ధికి ప్రభుత్వం కృషి

పర్వతగిరి: తెలంగాణ రాష్ట్ర ప్రభుత్వం గ్రామాల అభివృద్ధికి కృషి చేస్తుందని కాంగ్రెస్ పార్టీ మండల అధ్యక్షుడు జాటోతు శ్రీనివాస్‌నాయక్ అన్నారు. ఈ మేరకు మండలంలోని చౌటపల్లి గ్రామంలో సీడీఎఫ్ నిధులతో మంజూరైన సీసీ రోడ్డు పనులకు బుధవారం ప్రారంభించారు. గ్రామ పార్టీ అధ్యక్షుడు గద్దం జనార్దన్, నాయకులు లింగంపల్లి కుమార్‌రావు, నాయకులు వెంకటేశ్వరరావు, రాజేశ్వరరావు, రజబైన శ్రీనివాస్‌దాసు, కుమార్, వెంకన్న, శాంతికృష్ణ, రాజు, దామెర సదయ్య పాల్గొన్నారు.

విద్యార్థులు లక్ష్యాన్ని ఎంచుకుని చదవాలి


ఆర్‌ఓ ప్లాంటు నీటిని తాగుతున్న ఎమ్మెల్యే రేవూరి

గీసుకొండ: విద్యార్థులు ఉన్నత లక్ష్యాన్ని ఎంచుకుని చదవాలని పరకాల ఎమ్మెల్యే రేవూరి ప్రకాశ్‌రెడ్డి అన్నారు. బుధవారం గ్రేటర్ వరంగల్ 16వ డివిజన్ ధర్మారం జెడ్పీ పాఠశాలలో పూర్వ విద్యార్థి, కేయూ రిటైర్డ్ ప్రొఫెసర్ డాక్టర్ గాదె దయాకర్ సొంత ఖర్చుతో అందించిన ఆర్‌ఓ ప్లాంట్‌ను ఎమ్మెల్యే ప్రారంభించి మాట్లాడారు. పాఠశాలలో ఉన్న సమస్యలను త్వరగా పరిష్కరిస్తానని, క్రీడా మైదానం కోసం రెవెన్యూ అధికారులతో మాట్లాడుతానని హామీ ఇచ్చారు. ఈ సందర్భంగా విద్యార్థిని షాఫిక సమ్రీన్ భరత నాట్య ప్రదర్శనను చూసిన ఎమ్మెల్యే మెచ్చుకుని బహుమతి అందించారు. అలుమినీ కమిటీ వారు పాఠశాలకు మైక్‌సెట్‌ను అందించారు. అనంతరం ఎమ్మెల్యే ధర్మారంలోని ప్రభుత్వ ప్రాథమిక పాఠశాల, అంగన్‌వాడీ కేంద్రాలను తనిఖీ చేసి మధ్యాహ్నం భోజనం అందిస్తున్న తీరును అడిగి తెలుసుకున్నారు. రిటైర్డ్ ప్రొఫెసర్ గాదె దయాకర్, అలుమినీ కమిటీ ఉపాధ్యక్షులు గట్టికొప్పుల రాంబాబు, కార్యదర్శి వెంకటనారాయణ, కోశాధికారి కొట్టె ముత్తిలింగం, హెచ్‌ఎం సాంబయ్య, చాడ కొమురారెడ్డి, సంతోష్, తుమ్మనపల్లి శ్రీనివాస్, గోదాసి చిన్న, మాడిశెట్టి రాజయ్య పాల్గొన్నారు.

అటెన్షన్ ప్లీజ్



చెట్లపొదను తొలగించరూ..

చెన్నారావుపేటలోని హైస్కూల్ సమీపంలో నెక్కొండ–నర్సంపేట ప్రధాన రహదారిపై దట్టమైన చెట్లపొద ప్రమాదకరంగా ఉంది. గతంలో ఇక్కడ ఉన్న ట్రాన్స్‌ఫార్మర్‌ను తొలగించి రోడ్డు వెడల్పులో పక్కకు వేశారు. కానీ ఇనుప కంచెను వదిలేశారు. కంచె చుట్టూ పిచ్చి మొక్కలు ఏపుగా పెరిగి ప్రమాదకరంగా మారింది. తొలగించాలని ప్రయాణికులు, వాహనాదారులు కోరుతున్నారు.

– చెన్నారావుపేట

ప్రశ్నించాల్సిన అధికారి పేరు :
గొడిశాల వికాస్‌గౌడ్, పంచాయతీ కార్యదర్శి
ఫోన్‌నంబర్ : 89786 37907

గీత కార్మికుల హామీలు అమలు చేయాలి


సమావేశంలో మాట్లాడుతున్న రమేశ్‌గౌడ్

నర్సంపేట: కాంగ్రెస్ తమ ఎన్నికల మేనిఫెస్టోలో గీత కార్మికులకు ఇచ్చిన హామీలను అమలు చేయాలని గౌడ జన హక్కుల పోరాట సమితి మోకుదెబ్బ రాష్ట్ర వర్కింగ్ ప్రెసిడెంట్ అనంతుల రమేశ్‌గౌడ్ డిమాండ్ చేశారు. ఈ మేరకు పట్టణ అధ్యక్షుడు గండి గిరిగౌడ్ అధ్యక్షతన బుధవారం నిర్వహించిన మోకుదెబ్బ జిల్లా కమిటీ సమావేశంలో రమేశ్‌గౌడ్ మాట్లాడారు. కాటమయ్య రక్షణ కవచాలు ప్రతీ గీత కార్మికుడికి ఇవ్వాలన్నారు. ప్రమాదానికి గురై మృతి చెందిన, శాశ్వత వికలాంగులకు ఇచ్చే ఎక్స్‌గ్రేషియా రూ.5లక్షల నుంచి రూ.10లక్షలకు పెంచాలన్నారు. ట్యాంక్‌బండ్‌పై పాపన్న విగ్రహం ఏర్పాటుతోపాటు ఆయన జయంతిని ప్రభుత్వం అధికారికంగా నిర్వహించాలన్నారు. వరంగల్ జిల్లాలో మోకుదెబ్బ ఆధ్వర్యంలో ప్రతి నియోజకవర్గం, మండల, గ్రామ, గ్రామాన ఈనెల 18నుండి 25వ తేదీ వరకు సర్దార్ సర్వాయి పాపన్నగౌడ్ 374వ జయంతి కార్యక్రమాలు నిర్వహిస్తున్నట్లు పేర్కొన్నారు. నర్సంపేట పట్టణంలోని పాపన్న విగ్రహం వద్ద ఈ నెల 25వ తేదీన విగ్రహ కమిటీ ఆధ్వర్యంలో పెద్ద ఎత్తున జయంతి నిర్వహిస్తున్నామని తెలిపారు. మోకుదెబ్బ గౌరవ సలహాదారులు సోల్తి సారయ్యగౌడ్, జిల్లా అధ్యక్షుడు గోపగాని వెంకట్‌గౌడ్, రాష్ట్ర నాయకులు మద్దెల సాంబయ్యగౌడ్, మల్లేషంగౌడ్, రాముగౌడ్, పుల్లూరి శ్రీనివాస్‌గౌడ్, గణేష్, కర్ణాకర్, వెంకటేశ్వర్లు, మల్లికార్జున్, రాజుకుమార్, గంగాధర్ పాల్గొన్నారు.

సేఫ్టీ మోకుల పంపిణీ


సేఫ్టీ మోకులను పంపిణీ చేస్తున్న ఎక్సైజ్ సీఐ

పర్వతగిరి: మండలానికి చెందిన గీత కార్మికులకు వర్ధన్నపేట ఎక్సైజ్ సీఐ స్వరూప బుధవారం సేఫ్టీ మోకులను పంపిణీ చేశారు. కార్యక్రమంలో పర్వతగిరి గీత పారిశ్రామిక సహకార సంఘం అధ్యక్షుడు పుల్లూరి సారయ్యగౌడ్, ఉపాధ్యక్షుడు రంగు వెంకన్నగౌడ్, మాజీ అధ్యక్షుడు దొనికెన అరుణ్‌కుమార్, డైరెక్టర్ కక్కెర్ల యాకాంబ్రం, మడ్డి కుమారస్వామి తదితరులు పాల్గొన్నారు.

గీత కార్మికులకు శిక్షణ

వర్ధన్నపేట: కలెక్టర్ ఆదేశాల మేరకు ప్రొహిబిషన్ అండ్ ఎక్సైజ్ స్టేషన్ వర్ధన్నపేట పరిధిలోని వర్ధన్నపేట, పర్వతగిరి, సంగెం మండలాలకు చెందిన గీత కార్మికులకు బుధవారం శిక్షణ కార్యక్రమం నిర్వహించినట్లు ఎక్సైజ్ ఇన్‌స్పెక్టర్ స్వరూప తెలిపారు. బీసీ వెల్ఫేర్, ప్రొహిబిషన్ అండ్ ఎక్సైజ్ శాఖలు సంయుక్తంగా శిక్షణా కార్యక్రమం నిర్వహించినట్లు పేర్కొన్నారు. కార్యక్రమానికి 25 మంది గీత కార్మికులు హాజరు కాగా వీరికి తొలి విడత కాటమయ్య రక్షా కిట్స్ అందజేశామన్నారు. కార్యక్రమంలో అసిస్టెంట్ బీసీ వెల్ఫేర్ డిపార్ట్‌మెంట్ శంకరయ్య, ట్రైనర్ విష్ణు, రాకేశ్, రమేష్ బాబు, రాజయ్య, చల్లపల్లి నర్సయ్య గౌడ్ పాల్గొన్నారు.

ప్రతిభా పాటవాలను వెలికితీసేందుకే పోటీలు


ఆటల పోటీల్లో పాల్గొన్న మహిళలు

నర్సంపేట: మహిళల్లో దాగి ఉన్న ప్రతిభా పాటవాలను వెలికి తీయడానికి ఆటల పోటీలు ఉపయోగపడతాయని ప్రతిభ సంస్థ నిర్వాహకుడు గిరగాని సుదర్శన్‌గౌడ్ అన్నారు. ఈ మేరకు పట్టణంలో ప్రతిభ స్వచ్ఛంద సేవా సంస్థ, ఎఫ్‌ఎంఎం సోషల్ సర్వీస్ సొసైటీల ఆధ్వర్యంలో స్వాతంత్య్ర దినోత్సవం నేపథ్యంలో బుధవారం మగ్గం శిక్షణ మహిళలకు ఆటల పోటీలు రిటైర్డ్ పీఈటీ నాడెం సాంబయ్య సారథ్యంలో నిర్వహించారు. ఈ సందర్భంగా సుదర్శన్‌గౌడ్ మాట్లాడుతూ.. ఆటల పోటీల్లో గెలుపొందిన మహిళలకు నేడు(గురువారం) బహుమతులు అందజేయనున్నట్లు పేర్కొన్నారు. కార్యక్రమంలో స్వయంకృషి సంస్థ నిర్వాహకుడు బెజ్జంకి ప్రభాకర్, కన్జ్యూమర్ ఫోరమ్ విజిలెన్స్ కమిటీ మెంబర్ నాగెల్లి సారంగంగౌడ్, ఏఎస్‌ఆర్ సంస్థ నిర్వాహకుడు ఎర్రబోయిన రాజశేఖర్ తదితరులు పాల్గొన్నారు.

అక్రమ నిర్మాణదారులకు నోటీసులు జారీ

దుగ్గొండి: గిర్నిబావిలో ప్రధాన రహదారిని ఆక్రమించి నిర్మాణాలు చేపట్టిన పలువురికి అధికారులు బుధవారం నోటీసులు జారీ చేశారు. 50 ఫీట్ల వరకు రోడ్డును ఆక్రమించి నిర్మాణాలు చేశారు. దీంతో ట్రాఫిక్ ఇబ్బందులు తలెత్తాయి. ఈ మేరకు కలెక్టర్ సత్యశారద ఆదేశాల మేరకు అధికారులు రోడ్డుకు ఇరువైపులా ఉన్న నిర్మాణాలకు మార్కింగ్ చేశారు. నిర్మాణాలను 5 రోజుల్లో తీసేయకుంటే గ్రామ పంచాయతీ ఆధ్వర్యంలో తొలగిస్తామని ఎంపీడీఓ అరుంధతి, ఎంపీఓ శ్రీధర్‌గౌడ్ హెచ్చరించారు. పంచాయతీ కార్యదర్శి నూనె వేణు, పోలీస్ సిబ్బంది షాబీర్‌పాషా, రవి, కారోబార్ ముస్కు రాజు, ఆర్టీసీ సిబ్బంది, రోడ్డు భవనాల శాఖ సిబ్బంది, పారిశుద్ధ్య కార్మికులు పాల్గొన్నారు.

సీఎంఆర్‌ఎఫ్ చెక్కుల పంపిణీ


చెక్కులు పంపిణీ చేస్తున్న శ్రీనివాసరెడ్డి

దుగ్గొండి: మండలంలోని పలు గ్రామాలకు చెందిన 112మంది లబ్ధిదారులకు సీఎం రిలీఫ్ ఫండ్ చెక్కులను నర్సంపేట ఎమ్మెల్యే దొంతి మాధవరెడ్డి ఆదేశాల మేరకు బ్లాక్ కాంగ్రెస్ అధ్యక్షుడు తోకల శ్రీనివాసరెడ్డి బుధవారం గిర్నిబావిలో పంపిణీ చేశారు. ఈసందర్భంగా ఆయన మాట్లాడారు. మండల వ్యాప్తంగా అనారోగ్యంతో బాధపడుతూ చికిత్స చేయించుకోలేని పరిస్థితి ఉన్న వారికి ఎల్‌ఓసీలు, చికిత్స చేయించుకున్న అనంతరం ఆర్థిక భారాన్ని కొంత మేర తగ్గించుకోవడానికి సీఎంఆర్‌ఎఫ్ అందించడం జరుగుతుందన్నారు. కార్యక్రమంలో మండల వర్కింగ్ ప్రెసిడెంట్ చెన్నూరి కిరణ్‌రెడ్డి, ఒలిగే నర్సింగరావు, యూత్ డివిజన్ కన్వీనర్ వేముల ఇంద్రదేవ్, మట్ట రాజు, మాదాసి సాంబయ్య, రాజిరెడ్డి, ఆవుల నర్సింహారెడ్డి, బండారి ప్రకాశ్, భరత్‌రెడ్డి, రవివర్మ, శివాజీ, రోహిత్ పాల్గొన్నారు.

జాతీయ ఓబీసీ సదస్సులో పాల్గొన్న మెపా నాయకులు

నర్సంపేట: పంజాబ్‌లో ఇటీవల నిర్వహించిన జాతీయ ఓబీసీ సదస్సులో మెపా(ముదిరాజ్ ఎంప్లాయిస్ అండ్ ప్రొఫెషనల్స్ అసోసియేషన్ తెలంగాణ) జిల్లా ప్రధాన కార్యదర్శి పెండ్యాల కృష్ణముదిరాజ్, జిల్లా కమిటీ బాధ్యులు పాల్గొన్నారు. ఓబీసీ జాతీయ అధ్యక్షుడు జాజుల శ్రీనివాస్‌గౌడ్ ఆధ్వర్యంలో జరిగిన సమావేశంలో కృష్ణముదిరాజ్ పాల్గొని మాట్లాడారు.

రోడ్డు ప్రమాదంలో ఇద్దరి తీవ్ర గాయాలు

గీసుకొండ: మండలంలోని కొమ్మాల ఆర్చ్ సమీపంలో వరంగల్–నర్సంపేట రహదారిపై మంగళవారం రాత్రి జరిగిన రోడ్డు ప్రమాదంలో ఇద్దరికి తీవ్ర గాయాలైనట్లు గీసుకొండ ఇన్‌స్పెక్టర్ బాబూలాల్ తెలిపారు. ఆయన తెలిపిన వివరాల ప్రకారం.. మండలంలోని సూర్య తండాకు చెందిన ఆంగోతు దస్రు తన ద్విచక్ర వాహనంపై కొమ్మాలలోని పాల కేంద్రం వద్దకు వెళ్తుండగా.. అదే సమయంలో దస్రుతండాకు చెందిన హాలావత్ భద్రు బైక్‌పై నర్సంపేట వైపు నుంచి వరంగల్ వైపు వెళ్తూ దస్రు ప్రయాణిస్తున్న ద్విచక్ర వాహనాన్ని ఢీకొట్టాడు. ఈ ప్రమాదంలో ఇద్దరికి తీవ్ర గాయాలు కాగా ప్రైవేట్ ఆస్పత్రికి తరలించారు. దస్రు పరిస్థితి విషమంగా ఉందని, బాధిత కుటుంబాల ఫిర్యాదు మేరకు కేసు నమోదు చేసి దర్యాప్తు జరుపుతున్నామని ఇన్‌స్పెక్టర్ తెలిపారు.

బాధిత కుటుంబానికి పరామర్శ

పర్వతగిరి: మండలంలోని చౌటపల్లి గ్రామానికి చెందిన మట్టపల్లి యాదగిరిరావు తల్లి మట్టపల్లి సావిత్రమ్మ ఇటీవల మృతి చెందగా.. మాజీ మంత్రి ఎర్రబెల్లి దయాకర్‌రావు బుధవారం బాధిత కుటుంబ సభ్యులను పరామర్శించారు.

రాయపర్తి: మండలంలోని దుబ్బతండా మాజీ సర్పంచ్ దేదావత్ కమల భర్త వెంకన్న అనారోగ్యంతో బాధపడుతుండగా బుధవారం ఎర్రబెల్లి దయాకర్‌రావు పరామర్శించారు.

గీసుకొండ: మండలంలోని మచ్చాపూర్‌కు చెందిన కంబాల శ్రీనివాస్, గంగదేవిపల్లికి చెందిన మామిండ్ల లక్ష్మి కుటుంబ సభ్యులను పరకాల మాజీ ఎమ్మెల్యే చల్లా ధర్మారెడ్డి బుధవారం పరామర్శించారు. 16వ డివిజన్ కీర్తినగర్‌లో రోడ్డు ప్రమాదంలో గాయపడ్డ కక్కర్ల అనుదీప్, అనారోగ్యంతో బాధపడుతున్న ఆర్‌ఎంపీ రఫీలను పరామర్శించి ఆరోగ్య పరిస్థితిని తెలుసుకున్నారు. సుంకరి శివ, గోలి రాజయ్య, ప్రకాశ్, సిరిసె శ్రీకాంత్, ధర్మారావు, శ్రీనివాస్‌రెడ్డి, నాగేశ్వర్‌రావు పాల్గొన్నారు.

బాధిత కుటుంబాలకు చేయూత

రాయపర్తి: మండలంలోని పలు గ్రామాల్లో మృతిచెందినవారి కుటుంబాలను ఎస్‌ఆర్‌ఆర్ ఇన్ఫ్రా సంస్థల అధినేత పరుపాటి శ్రీనివాస్‌రెడ్డి బుధవారం ఫోన్‌లో పరామర్శించారు. జింకురాంతండాకు చెందిన కాంగ్రెస్ ఎస్టీసెల్ మండల అధ్యక్షుడు శ్రీనివాస్ తల్లి కౌసల్య మృతిచెందగా ఆమె కుటుంబాన్ని, కొండూరుకు చెందిన రమేశ్, కాట్రపల్లికి చెందిన ముప్పిడి కుమారస్వామి కుటుంబాలకు బియ్యం, సరుకులను అందించారు.

ఎన్నికల్లో విజయానికి కృషి చేయాలి

రాయపర్తి: స్థానిక సంస్థల ఎన్నికల్లో యూత్ నాయకులు కీలకపాత్ర పోషించి విజయం సాధించేలా కృషి చేయాలని కాంగ్రెస్ మండలపార్టీ అధ్యక్షుడు ఈదులకంటి రవీందర్‌రెడ్డి పిలుపునిచ్చారు. బుధవారం మండలకేంద్రంలోని కాంగ్రెస్‌పార్టీ కార్యాలయంలో ఆయన మాట్లాడారు.

ప్రభారీల నియామకం

గీసుకొండ: బీజేపీ జిల్లా మోర్చాల ప్రభారీల(ఇన్‌చార్జ్)ను బుధవారం జిల్లా అధ్యక్షుడు గంట రవికుమార్ నియమించారు. ఎస్సీ మోర్చా ప్రభారీగా బన్న ప్రభాకర్, మైనార్టీ మోర్చా ప్రభారీగా రాదారపు శివకుమార్, మహిళా మోర్చా ప్రభారీగా తన్నం సతీశ్ షా, కిసాన్ మోర్చా ప్రభారీగా జి.రాజాప్రతాప్ రెడ్డి, ఎస్టీ మోర్చా ప్రభారీగా అజ్మీరా శ్రీరాం నాయక్, ఓబీసీ మోర్చా ప్రభారీగా కుసుమ సతీశ్‌బాబు, యువమోర్చా ప్రభారీగా జలంగం రంజిత్‌ను నియమించినట్లు బీజేపీ కార్యాలయ కార్యదర్శి కంది క్రాంతి కుమార్ ఒక ప్రకటనలో పేర్కొన్నారు.

వర్ధన్నపేట: కట్ర్యాల గ్రామానికి చెందిన చెంగల సురేశ్‌ను బీజేపీ యువ మోర్చా నియోజకవర్గ అధ్యక్షుడిగా నియమించినట్లు జిల్లా అధ్యక్షుడు భరత్ బుధవారం ఒక ప్రకటనలో తెలిపారు. సురేశ్ గతంలో యువమోర్చా మండల అధ్యక్షుడిగా, శక్తి కేంద్ర ఇన్‌చార్జ్‌గా పని చేశారు.

నియామకం

రాయపర్తి: మండలంలోని కాట్రపల్లికి చెందిన రాపాక ప్రశాంత్ బీజేవైఎం జిల్లా ప్రధానకార్యదర్శిగా, రాయపర్తికి చెందిన పెండ్యాల గణేశ్‌కు బీజేవైఎం జిల్లా అధికారప్రతినిధిగా నియమితులయ్యారు.

'ఎంపీ మాటలను వక్రీకరించడం సరికాదు'

చెన్నారావుపేట: మహబూబాబాద్ ఎంపీ బలరాం నాయక్ మాటలను బీఆర్‌ఎస్ నాయకులు వక్రీకరించడం సిగ్గుచేటని కాంగ్రెస్ పార్టీ మండల అధ్యక్షుడు భూక్య గోపాల్‌నాయక్ అన్నారు. ఈ మేరకు బుధవారం ఆయన విలేకరుతో మాట్లాడారు. ఎంపీపై సోషల్ మీడియాలో వస్తున్న అసత్య ప్రచారాలను తీవ్రంగా ఖండిస్తున్నామన్నారు. మహబూబాబాద్‌లో సీఎంఆర్‌ఎఫ్ చెక్కుల పంపిణీ కార్యక్రమంలో ఎంపీ ప్రసంగించిన మాటలను బీఆర్‌ఎస్ నాయకులు వక్రీకరించి సోషల్ మీడియాలో ప్రచారం చేయడం నీతిమాలిన చర్య అని మండిపడ్డారు.

బాల్‌నాయక్‌తండాలో చైన్‌స్నాచింగ్

రాయపర్తి: వృద్ధ దంపతులపై దాడి చేసి, చైన్‌స్నాచింగ్‌కు పాల్పడిన సంఘటన బాల్‌నాయక్‌తండా సమీపంలో మంగళవారం రాత్రి చోటు చేసుకుంది. స్థానికుల కథనం ప్రకారం.. బాల్‌నాయక్‌తండాకు చెందిన వృద్ధ దంపతులు బానోత్ రాములు–కమిలి తొర్రూరు పట్టణంలోని ఆస్పత్రికి వెళ్లి తిరుగు ప్రయాణంలో సన్నూరుకు చేరుకున్నారు. ఈ క్రమంలో సన్నూరు నుంచి కాలినడకన బాల్‌నాయక్‌తండాకు వెళ్తున్నారు. మద్యం తాగి ఉన్న అదేతండాకు చెందిన ఆటో డ్రైవర్ ధరావత్ తిరుమలేశ్ వారిని వెంబడించారు. వారిని నెట్టివేసి కమిలి మెడలో ఉన్న పుస్తెలతాడును తెంపుకొని పారిపోయాడు. వారు అరవడంతో కుమారుడు హరిచంద్, గ్రామస్తులు భూక్యా శ్రీరామ్, భూక్యా అశోక్ తదితరులు అక్కడికి వచ్చి ఆటోడ్రైవర్‌ను గుర్తుపట్టి పుస్తెలతాడును ఇప్పించారు. పోలీసులు సంఘటన స్థలానికి చేరుకొని నిందితుడిని అదుపులోకి తీసుకొని విచారణ చేస్తున్నట్లు గ్రామస్తులు తెలిపారు.